క్లుప్తంగా

ఘనంగా అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు

వేంపల్లె : కడప–పులివెందుల బైపాస్ రోడ్డులోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్పస్వామి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. బుధవారం అయ్యప్పస్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి పాలాభిషేకం, మహా మంగళహారతి, కుంకుమార్చనలు తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం చిన్నారుల కోలాట, పాట కచేరి కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నరసింహారెడ్డి, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే రాక

కమలాపురం : స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో గురువారం నిర్వహిస్తున్న వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలకు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి హాజరు కానున్నట్లు వెలుగు ఏపీఎం అపర్ణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని స్వయం సహాయక సంఘాల సభ్యులు, వీఓఏలు హాజరై కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆమె తెలిపారు.

నేడు 'గడప గడపకు మన ప్రభుత్వం'

మైలవరం (జమ్మలమడుగు రూరల్) : మైలవరం మండలంలోని కర్మలవారిపల్లె గ్రామంలో గురువారం మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పాల్గొంటారని మండల కన్వీనర్ ధన్నవాడ మహేశ్వరరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

నిరుద్యోగ మహిళలకు ఇంటర్వ్యూలు

సింహాద్రిపురం : స్థానిక వెలుగు కార్యాలయంలో బుధవారం ఏపీఎం మంజునాథ ఆధ్వర్యంలో ఆదిత్యా బిర్లా గార్మెంట్స్‌కు సంబంధించి ట్రైనీ టైలర్ కొరకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. నిరుద్యోగ మహిళల సర్టిఫికెట్లను పరిశీలించి ఎంపిక చేశారు. కార్యక్రమంలో సీసీలు, జాబ్స్ కో ఆర్డినేటర్ దివాకర్, ఆదిత్య బిర్లా హెచ్ఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వాచ్‌మెన్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

వేంపల్లె : ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో 14 ఏళ్లుగా పనిచేస్తున్న వాచ్‌మెన్లకు ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.సి.బాదుల్లా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బుధవారం స్థానిక ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో సెక్యూరిటీ గార్డుల సమావేశం నిర్వహించి ఆయన మాట్లాడారు. ఇంతవరకు వాచ్‌మెన్లకు వేతనాలు పెంచకపోవడంతో వారిలో భయాందోళన వ్యక్తమవుతోందన్నారు. పేరుకు మాత్రమే వాచ్‌మెన్ ఉద్యోగమని.. అన్ని రకాల పనులు చేయించుకుంటున్నారన్నారు.

'మీరెన్ని చేసినా గెలవలేరు'

పులివెందుల రూరల్ : తెలుగుదేశం పార్టీ నాయకులు లోకేష్, చంద్రబాబులు ఎన్ని పాదయాత్రలు చేసినా, పొర్లు దండాలు పెట్టినా రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కూడా గెలవలేరని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రసూల్ అన్నారు. బుధవారం స్థానిక దూదేకుల సంఘ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ దొడ్డిదారిన నారా లోకేష్ ఎమ్మెల్సీ అయ్యారని.. 2024లో అధికారంలోకి వస్తామని టీడీపీ నాయకులు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికలలో మంగళగిరి, కుప్పం నియజకవర్గాలలో కూడా వైఎస్సార్‌సీపీ గెలవడం తథ్యమన్నారు.

పదేళ్ల తర్వాత మొర్రాయిపల్లెలో సీతారాముల కల్యాణం

చాపాడు : మండలంలోని మొర్రాయిపల్లె గ్రామంలో పదేళ్ల తర్వాత సీతారాముల కల్యాణ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా రాష్ట్ర అటవీ సంస్థ అభివృద్ధి చైర్మన్ గుర్రంపాటి దేవేందర్‌రెడ్డి కుటుంబ సమేతంగా హాజరయ్యారు. పదేళ్ల క్రితం వివిధ కారణాల వల్ల కల్యాణం జరగలేదు. ఇటీవల గ్రామస్తులందరూ ఏకతాటిపై నిలిచి రామాలయాన్ని పునర్నిర్మించారు. ఈ క్రమంలో బుధవారం గ్రామస్తులందరూ కలసి సీతారాముల కల్యాణ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇదే క్రమంలో ఉత్సవమూర్తుల విగ్రహాలతో గ్రామోత్సవం ప్రజలందరూ కలసి నిర్వహించారు.

అభినందన మాల



బద్వేలు : కాశినాయన మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎంపీపీ నల్లేరు విశ్వనాథరెడ్డి పుట్టినరోజు సందర్భంగా అభిమానులు, పార్టీ నాయకులు భారీ గజమాలతో అభినందనలు తెలిపారు. ఈ వేడుకలను పోరుమామిళ్లలోని ఆయన స్వగృహంలో ఘనంగా నిర్వహించారు. నియోజకవర్గంలోని వివిధ మండలాల నుంచి వేలాదిగా వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిదులు, స్నేహితులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. విశ్వనాథరెడ్డి వారందరికీ ధన్యవాదాలు తెలపడంతో పాటు విందు ఏర్పాటు చేశారు.

మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



డ్వాక్రా సంఘాల సభ్యులకు మెగా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ ఆసరా మూడవ విడత సంబరాలు కార్యక్రమంలో ఆయన జెడ్పీటీసీ నరేన్ రామాంజుల రెడ్డితో కలసి పాల్గొని మాట్లాడారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే ఆ కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. గత ప్రభుత్వం రుణాలను మాఫీ చేయిస్తామని మాయ మాటలు చెప్పి మోసం చేసిందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాదయాత్రలో చెప్పిన మాటకు కట్టుబడి డ్వాక్రా అక్కా చెల్లెమ్మల బ్యాంకు రుణాలన్నింటినీ చెల్లించారన్నారు. అనంతరం మండల వ్యాప్తంగా 562 స్వయం సహాయక సంఘాలకు సంబంధించి రూ.4,15,36,735 చెక్కును మహిళలకు అందజేశారు. మహిళలంతా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా ఉండి ఆయనను ఆశీర్వదించాలన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, రాష్ట్ర అటవీశాఖ డైరెక్టర్ రామన శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ మాజీ డీసీఎంఎస్ ప్రతాప్‌రెడ్డి, సర్పంచ్ సిద్దిగారి వెంకటసుబ్బయ్య, మండల ఉపాధ్యక్షులు ఆర్ఎస్ఆర్, గణేష్‌రెడ్డి, మండల కో ఆప్షన్ మెంబర్ వారిస్, ఎంపీటీసీలు, అధికారులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే జగనన్న లక్ష్యం



లబ్ధిదారురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి, చైర్‌పర్సన్ శివమ్మ

జమ్మలమడుగు : ప్రతి మహిళ ఆర్థికంగా ఎదగాలన్నదే జగనన్న లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. బుధవారం పట్టణంలోని కన్నెలూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ, మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డిలతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల సమస్యలతో పాటు వారు అందుకున్న సంక్షేమ పథకాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల మహిళలను నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రుణమాఫీ చేస్తానని చెప్పి అధికారంలోనికి రాగానే మోసం చేశారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా ప్రతి మహిళకు కనీసం లక్ష రూపాయల వరకు రుణమాఫీ చేసిన ఘనత జగన్‌కు దక్కుతుందన్నారు. విద్యార్థులకు ట్యాబ్‌లు ఇచ్చి వారిని భవిష్యత్తులో మంచి ఉన్నత స్థాయిలోచూడాలనుకున్నారు. లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు నేరుగా వారి ఖాతాలలో జమచేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ సలోమి, కోఆప్షన్ సభ్యుడు లక్ష్మయ్య, హృషి కేశవరెడ్డి, మార్బల్ శ్రీను, చంద్రమౌళి, తదితరులు పాల్గొన్నారు.

'మా నమ్మకం నువ్వే జగనన్న' పోస్టర్ల ఆవిష్కరణ



పులివెందులలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న వైఎస్ఆర్‌సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని స్థానిక వైఎస్ మనోహర్‌రెడ్డి నివాస ఆవరణలో బుధవారం మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, వైస్ చైర్మన్ హఫీజ్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్‌హాలు గంగాధరరెడ్డిలు జగనన్న నువ్వే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే జగనన్న పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. ఈనెల 7వ తేదీనుంచి ఇంటింటికీ జగనన్న నువ్వే మా భవిష్యత్తు అనే కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సీఎంతో నేరుగా మాట్లాడేందుకు 82960 82960 అనే నెంబర్‌కు ఫోన్ చేసి మాట్లాడవచ్చునన్నారు. ఈ కార్యక్రమం ఈనెల 7వ తేదీ నుంచి 20వ తేదీవరకు ఇంటింటి కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కోడి రమణ, పార్నపల్లె కిశోర్, రాజశేఖరరెడ్డి, డేనియల్‌బాబు, కోఆప్షన్ మెంబర్ చంద్రమౌళి, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి, అంకాలమ్మ ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ సర్వోత్తమరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

జమ్మలమడుగు : జగనన్నే మా భవిష్యత్తు, మా నమ్మకం నువ్వే అనే పోస్టర్‌ను ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి ఆవిష్కరించారు. బుధవారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సచివాలయకన్వీనర్లతో కలసి ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కొన్నిరోజుల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పొరెడ్డి మహేశ్వరరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్కిరెడ్డి హనుమంతురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి

పులివెందుల టౌన్ : వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రజల దాహార్తి తీర్చేందుకు మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని ముద్దనూరు రోడ్డు గాంధీ సర్కిల్‌లో ఉన్న బస్‌షెల్టర్ వద్ద 4వ వార్డు కౌన్సిలర్ పార్నపల్లె కిశోర్ తన తల్లి బాలమ్మ జ్ఞాపకార్థం ప్రముఖ చిన్నపిల్లల డాక్టర్ దివంగత ఇసీ గంగిరెడ్డి మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేసి ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నప్ప, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రేపు చెవి, ముక్కు, గొంతు వైద్య నిపుణులు రాక

పులివెందుల : పట్టణంలోని భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(ఇసీ గంగిరెడ్డి ఆసుపత్రి)లో (రేపు) శుక్రవారం ఉదయం చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టర్ వి.ప్రతాప్‌రెడ్డి చెవిలో చీము కారుట, చెవి నొప్పి, చెవిలో శబ్దములు, చెవిలో కర్ణబేరికి రంధ్రం, చెవిటి మిషన్లు అమర్చడం, చెవిలో బలపాలు, పూసలు తీయుట, ముక్కు దూలం సరిచేయుట, అలర్జీ, సైనుసైటిస్, ముక్కులో రక్తం కారుటకు, ముక్కులో బలపాలు, పూసలు తీయుట, ముక్కులో గడ్డలకు, ఎండోస్కోపి సైనస్ సర్జరీ, గొంతులో గడ్డలకు శస్త్ర చికిత్స, స్వర పేటికలో లోపాలకు చికిత్స, గొంతులో ఇరుక్కుపోయిన చేప ముల్లులు, నాణేలు తీయుట, గొంతులో ఇన్‌ఫెక్షన్‌కు మాటలు రానివారికి చికిత్స, తలనొప్పి, తల తిరుగుట చికిత్స, తదితర వాటికి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు. అలాగే ఆసుపత్రిలో 24 గంటలు ఎండోస్కోపీ, కోలనోస్కోపీ పరీక్షలతోపాటు గ్యాస్ట్రబుల్ తీవ్రత తెలుసుకోవడం, చిన్నపిల్లలు నాణేలు, పిన్నులు, సూదులు, ముక్కలు మింగితే తీయడం జరుగుతుందని.. ఎసోఫజిల్ వెరిసెస్‌కు ఎండోస్కోనిక్ బాండిన చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 08568286189, 9963170177 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

దళితుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్



పులివెందులలో జగ్జీవన్‌రామ్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న మున్సిపల్ చైర్మన్



వేంపల్లెలో బాబు జగ్జీవన్ రామ్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ లక్ష్మీగాయత్రి

పులివెందుల టౌన్ : దళితుల ఆశాజ్యోతి బాబు జగ్జీవన్ రామ్ అని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక భాకరాపురంలోని సీఎం క్యాంపు కార్యాలయంలో జగ్జీవన్‌రామ్ 116వ జయంతిని ఘనంగా నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్లు కోడి రమణ, లక్ష్మీభార్గవి, ఖాదర్‌బాషా, రాజశేఖరరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు సోపాల వీరా, జేసీఎస్ ఇన్‌చార్జి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్‌అండ్ సైన్స్ కళాశాలలో.. : పట్టణంలోని చిన్నరంగాపురం సమీపంలో ఉన్న ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆసోసియేట్ డీన్ ఎం.ఎస్.భేగ్, కళాశాల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యాలయంలో బుధవారం మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు, ఉపాధ్యాయులు, సేవా సమితి సభ్యులు, మార్కెట్ యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

జమ్మలమడుగు : బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకుని ప్రొద్దుటూరు రహదారిలో ఉన్న ఆయన విగ్రహానికి వివిధ సంఘాల నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హస్తకళల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ విజయలక్ష్మీ, మున్సిపల్ వైస్ చైర్మన్ సింగరయ్య, ఎంఈఎఫ్ జిల్లా అధ్యక్షుడు పిచ్చుక బాబులు మాట్లాడుతూ అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడిన పోరాటయోదుడు జగ్జీవన్‌రామ్ అన్నారు. అలాగే ఎమ్మెల్యే డాక్టర్ మూలె సుధీర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వేల్పుల శివమ్మలు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

వేంపల్లె : భారత మాజీ ఉప ప్రధాని బాబు జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలను అంబేడ్కర్ సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బుధవారం స్థానిక నాలుగు రోడ్ల కూడలిలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీపీ లక్ష్మీగాయత్రి, అంబేడ్కర్ సేవా సమితి అధ్యక్షుడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పెద్ద దర్గాలో భక్తుల సందడి



దర్గాలో వెలసిన దుకాణాల వద్ద భక్తులు

కమలాపురం : కమలాపురం పెద్ద దర్గాగా ప్రఖ్యాతి గాంచిన దర్గా–ఏ–గఫారియా, ఖాదరియా భక్తుల సందడిగా మారిపోయింది. బుధవారం నుంచి ఉరుసు ఉత్సవాలు ప్రారంభం కావడంతో దర్గా ప్రాంగణం అంతా భక్తులతో నిండి పోయింది. రంగు రంగుల విద్యుద్దీపాలతో దర్గా సుందరంగా కనిపించింది. అలాగే దర్గా స్వాగత ద్వారం, ఖవ్వాలీ స్టేజీలన్ని అందంగా అలంకరించారు. అలాగే చిన్నారుల కోసం జాయింట్ వీల్, బ్రేక్ డ్యాన్స్ లాంటివి ఏర్పాటు చేశారు. రాష్ట్రం నలుమూలల నుంచే కాక తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. గంధం ఇంటి నుంచి నషాన్ జెండాను వైభవంగా ఊరేగించారు. బాణా సంచా పేల్చుతూ డప్పు వాయిద్యాలతో ఊరేగింపు సాగింది. అనంతరం దర్గా చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

సర్వాంగ సుందరంగా రామాలయం



ప్రారంభానికి సిద్ధమైన శ్రీరామాలయం

లింగాల : లింగాలలో రామాలయం సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటోంది. కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎండోమెంట్ కింద నిధులు మంజూరు చేయించారు. ప్రజల భాగస్వామ్యంతో రూ.9.40లక్షలు ఎండోమెంట్‌కు చెల్లించగా.. ఎండోమెంట్ ద్వారా రూ.37.60లక్షల నిధులు మంజూరయ్యాయి. సుమారు రూ.47లక్షల వ్యయంతో రామాలయ నిర్మాణ పనులు చేపట్టారు. దీనికితోడు గ్రామ ప్రజల సహాయ సహకారాలతో మరో రూ.10లక్షలు వ్యయం చేసి అతి సుందరంగా శ్రీరామాలయం నిర్మిస్తున్నారు. బుధవారం వేద పండితులు శ్రీరామాలయానికి చేరుకుని ఆలయ ప్రారంభ తేదీలను నిర్ణయించారు. మే 1, 2, 3వ తేదీలలో ఆలయ జీర్ణోద్ధరణ, దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ, హోమాలు, కలశ పూజ తదితర పూజాది కార్యక్రమాల నిర్వహణకు తేదీలను ప్రకటించారు. అదేవిధంగా గ్రామంలోని యువకులు బండలాగుడు పోటీలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 3వ తేదీన ఉదయం బండలాగుడు పోటీలు, రాత్రి పాటల కచేరీ నిర్వహించాలని నిర్ణయించారు.

వైభవంగా కల్యాణం

ప్రొద్దుటూరు కల్చరల్ : రామేశ్వరంలోని ప్రసిద్ధి చెందిన ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. బుధవారం తెల్లవారుజామున శ్రీరామ చంద్రమూర్తి ప్రతిష్ఠించిన సైకత లింగానికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన నిర్వహించి స్వామి, అమ్మవార్లను శోభాయమానంగా అలంకరించారు. రాత్రి గంగాగౌరి సమేత ముక్తిరామలింగేశ్వర స్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేశారు. వేద పండితులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల మధ్య స్వామి వారి కల్యాణం సుముహూర్తంలో వైభవంగా నిర్వహించారు. స్వామివారి కల్యాణం తిలకించడం వల్ల కలిగే శుభాలను అర్చకులు వివరించారు.

నేటి నుంచి అంకాలమ్మ తిరునాల



ఆలయ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేస్తున్న అశోక్‌రెడ్డి

సింహాద్రిపురం : మండల పరిధిలోని అంకాలమ్మ గూడూరులో వెలసిన అంకాలమ్మతల్లి తిరునాల గురువారం నుంచి ప్రారంభమవుతున్నట్లు ఆలయ అర్చకులు అనిల్‌కుమార్ శర్మ తెలిపారు. గురువారం ఉదయం అమ్మవారి కంకణ దారణ కార్యక్రమం, 13వ తేదీన మొదటి వారం, 16వ తేదీన రెండవ వారం అమ్మవారికి పంచాభిషేకం, ప్రత్యేక అలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారన్నారు. అలాగే 20వ తేదీన అమావాస్య కావడంతో అమ్మవారికి కల్యాణోత్సవంతో అమ్మవారి తిరునాల ముగుస్తుందని ఆయన తెలిపారు.

అంకాలమ్మ ఆలయ చైర్మన్‌గా అశోక్‌రెడ్డి

మండల పరిధిలోని అంకాలమ్మగూడూరు గ్రామంలోని అంకాలమ్మ ఆలయ చైర్మన్‌గా కటికరెడ్డి అశోక్ రెడ్డిని బుధవారం ఎన్నుకున్నారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డిల సహకారంతో దేవాలయ అభివృద్ధికి కృషి చేస్తానని ఆలయ చైర్మన్ అశోక్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

తపస్కాల పవిత్ర సాంగ్యాలలో పాల్గొనండి

– ఫాదర్ అబ్రహం పిలుపు

కడప కల్చరల్ : క్రైస్తవులందరూ తపస్కాల పవిత్ర సాంగ్యాలలో పాల్గొనాలని ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం డైరెక్టర్ ఫాదర్ అబ్రహం పిలుపునిచ్చారు. బుధవారం చర్చి ఆవరణలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. క్రైస్తవులు గుడ్‌ఫ్రైడేకి ముందు జరిగే తపస్కాల సాంగ్యాలలో పాల్గొని మనకోసం శిలువలో మరణించి ఉత్థానం చెందిన క్రీస్తునాథుని ఆశీర్వాదం పొందడానికి, దివ్య సంస్కార సాంగ్యాలలో పాల్గొనడానికి తప్పక రావాలని సూచించారు. గుడ్‌ఫ్రైడే విశేష కార్యక్రమాలు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. అందులో భాగంగా పెద్ద బేస్తవారాన్ని పురస్కరించుకుని సాయంత్రం 5.30 గంటలకు పాప సంకీర్తన, పవిత్ర దివ్య బలిపూజలో పూజలు నిర్వహిస్తామని తెలిపారు. ఇందులో శిష్యుల పాదాలు కడిగే సాంగ్యం ప్రధానమని వివరించారు. అనంతరం కడరాత్రి భోజన కార్యక్రమంలో ప్రత్యేకంగా అలంకరించిన దివ్య మండపంలో రాత్రి 12 గంటల వరకు దివ్య సత్ప్రసాద ఆరాధన ఆశీర్వాదం ఉంటుందన్నారు. పవిత్ర శుభ శుక్రవారం నాడు మధ్యాహ్నం 2 గంటలకు చర్చి ఆవరణలో శిలువ మార్గం నిర్వహిస్తామని తెలిపారు. క్రీస్తు పునరుత్థాన మహోత్సవ పరిశుద్ధ ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రత్యేక దివ్య బలిపూజ ఉంటుందని, అనంతరం సకల మానవాళికి క్రీస్తు పునరుత్థాన పవిత్ర ముగింపు సాంగ్యాలు ఉంటాయని వివరించారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలో పని చేస్తున్న ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ఆర్టీసీ యాజమాన్యం పరిష్కరించాలని ఎంప్లాయీస్ యూనియన్ కడప డిపో అధ్యక్ష, కార్యదర్శులు ఎ.రామ్మూర్తి, రాములు తెలిపారు. బుధవారం కడప డిపో కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఏపీ అమరావతి జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రావాల్సిన ఆర్థికపరమైన అంశాలు, పీఆర్సీ, అరియర్స్, డీఏలు, మిగిలిపోయిన ఓటీలు, నైట్ అవుట్ అలవెన్సులు రావాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం చొరవచూపలన్నారు.

తెలుగుభాషకు ప్రాధాన్యత అవసరం

కడప కల్చరల్ : జిల్లాలో తెలుగుభాష అమలు విషయంగా ప్రాధాన్యతనిద్దామని రాష్ట్ర అధికారభాషా సంఘం సభ్యులు తవ్వా వెంకటయ్య కలెక్టర్‌ను కోరారు. బుధవారం ఆయన కలెక్టర్ విజయరామరాజును ఆయన చాంబర్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. వైఎస్సార్ జిల్లాలో అధికారభాషగా తెలుగు గొప్పగా అమలయ్యేలా తగు చర్యలు చేపట్టాలని ఆయన కోరారు.

కార్మికులకు అండగా ఉండాలి

కడప కల్చరల్: తొమ్మిదేళ్ల ఎన్‌డీఏ పాలనలో కార్పొరేట్లకు సంపద, పేదలకు దరిద్రం దక్కాయని, ఈ పరిస్థితి పోవాలంటే ప్రత్యామ్నాయ విధానాలే శరణ్యమని ఎల్ఐసీ ఉద్యోగుల సంఘం కడప డివిజన్ ప్రధాన కార్యదర్శి రఘునాథరెడ్డి అన్నారు. దేశ వ్యాప్త పిలుపుమేరకు స్థానిక ఎల్ఐసీ డివిజనల్ కార్యాలయం వద్ద సంఘం అధ్యక్షులు అవధానం శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన భోజన విరామ ప్రదర్శనలో ఆయన మాట్లాడారు. ఈ ప్రభుత్వ హయాంలో దేశంలో జీడీపీ పతనమైందని, నిరుద్యోగం, ద్రవ్యోల్బణం అదుపు తప్పాయన్నారు. ఎల్ఐసీ లాంటి ప్రభుత్వరంగ సంస్థ మార్కెట్ లీడర్‌గా విజృంభిస్తూ ఉన్నా కేంద్రం వాటిని బలహీనపరిచే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కార్మికులందరికీ రూ. 26 వేల కనీస వేతనం, రూ.10 వేల కనీస పెన్షన్ చెల్లించాలని, నూతన పెన్షన్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్‌చేశారు. పెన్షనర్ల సంఘం కార్యదర్శి సుధీకర్, యూనియన్ నాయకులు అమీనా పర్వీన్, రాజు, అయ్యవారురెడ్డి, శ్రీకృష్ణ, కుమార్, నజీరుల్లా, చంద్ర, నరసయ్య, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలి

కడప ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి ప్రభుత్వం వెంటనే డీఎస్సీ నిర్వహించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శేఖర్‌బాబు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామసుబ్బయ్య, సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఖాళీలను భర్తీ చేయక అప్‌గ్రేడేషన్ పేరుతో పోస్టులు రద్దు చేసుకుంటూ పోవడం అన్యాయం అన్నారు. ప్రపంచ బ్యాంకుల షరతులను విద్యపై రుద్దడం సబబుకాదన్నారు. జేఎల్ పదోన్నతులు ఉపాధ్యాయలకు ఇవ్వకుండా కేవలం బోధనేతర సిబ్బందికి కల్పించడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అపార అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు జేఎల్ పదోన్నతులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డీఎస్సీ, జేఎల్ పదోన్నతుల కోసం ఈ నెల 23న కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అలీఖాన్, చంగల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరేలా చైతన్యం తీసుకురావాలి

వైవీయూ: ఎన్‌సీసీలో చేరేలా విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని కడప 30 ఆంధ్రా బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రాజ్‌కుమార్ థాపా సూచించారు. తెలుగుగంగకాలనీలోని ఎన్‌సీసీ నగర్‌లో పర్మినెంట్ ఇన్‌స్ట్రక్టర్స్ ఓరియంటేషన్ కోర్సు (పీఐఓసీ)లో భాగంగా తిరుపతి గ్రూప్ పరిధిలోని ఆర్మీ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఓ మాట్లాడుతూ ఆర్మీ విధులు నిర్వహించిన సిబ్బందికి ఎన్‌సీసీ విధివిధానాలు, శిక్షణ పట్ల అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎన్‌సీసీ అధికారి ఇమామ్ ఖాసీం మాట్లాడారు.